కథ

# ఊర్ధ్వపోషణం

వేంపల్లి గంగాధర్

నాన్నను చూస్తే కళ్ళముందు వూరు కన్పిస్తుంది. అందుకే వూరు గుర్తుకొచ్చిన ప్రతిసారీ నాన్నని రమ్మని కబురు పెడ్తుంటాను. ఆయన నేలను నమ్ముకున్న మనిషి. దాన్ని విడిచి ఎప్పుడొస్తాడు? ఆయన రాకకు బలమైన కారణం వుంటే గానీ వూర్నుంచి కదలడు కదా!

వూరి గాలిలోనే మన ఊపిరుంది. మనుషులమిక్కడ... మనసక్కడ! గుడి ధ్వజస్తంభంపైన వాలిన చిలకలగుంపు, గాలిగోపురం పైన వాలిన అడవి పావురాల అలికిడి, తెల్లారకముందే ఇంటి గుమ్మాల ముందు అందంగా విప్పారే ముగ్గుల పువ్వులు, వాకిళ్ల ముంగిట్లో కళ్ళాపి చినుకులు, వూరి మట్టిలో, ఏటిగట్టున, నాట్లు వేసే ఆడోళ్ళు పాడే పాటలా, చింతచెట్ల నీడలో ఊయల ఆటలా, ప్రసాదం పెట్టిన గుడిని, పాఠాలు చెప్పిన బడిని, వరి పైరుతో పచ్చగా నవ్వే మడిని, అనురాగం పంచిన అమ్మఒడిని గుర్తు చేసుకున్న ప్రతిసారీ కళ్ళకింద వెచ్చని తడి జ్ఞాపకాలు... ఇంటికి పండగరోజు కట్టిన మామిడి తోరణాల్లా...! నాన్నను చూస్తే వూరు గుర్తుకొస్తుంది.

★★★

పండుగల సీజన్ కాబట్టి ఇమ్లిబన్ బస్టాండు ప్రయాణీకులతో రద్దీగా వుంది. ముందుగానే రిజర్వేషన్ చేయించుకోవడం వల్ల బస్సు పాయింట్ లోకి రాగానే నెంబర్ వెతికి నింపాదిగా నాన్నను సీట్లో కూర్చోబెట్టాను. చల్లటి వాటర్ బాటిల్ కొని తెచ్చి చేతికిచ్చాను. బస్సు కదలడానికి ఇంకొంచెం సమయం పట్టవచ్చు.

'పెద్దోడా! యింగ నువ్వు ఇంటికి పో. కోడలు నీ కోసం చూస్తా వుంటాది. బస్సు కదిలేదానికి టైముండాది. నేను వూరికి పోతా పో. చీకటైంది మళ్ళా నువ్వు అంత దూరం పోవాల' చెప్పినాడు నాన్న మూసేసిన కిటికీ అద్దం తెరుస్తా.

చల్లటిగాలి రివ్వున ఎగుర్తా వచ్చింది.

బయట చీకటి ఆకాశంలో నక్షత్రాలు మిణుగురు పురుగుల్లా మెరుస్తున్నాయి.

'బైక్‌లో ఎంత సేపు వెళ్తాలే నాన్న... నువ్వు బద్రంగా కూర్చో. నీ బ్యాగ్ పైన వుంది. దిగేటప్పుడు జాగ్రత్తగా దించుకో. పొద్దున్నే పల్లె దగ్గర బస్సు దిగుతూనే ఫోన్‌చేసి నాతో మాట్లాడు. అక్కడికెళ్ళి నువ్వేం చేస్తావు? ఇంకో రెండ్రోజులు మా దగ్గరే వుండొచ్చు కదా!' అయిష్టమైన నాన్న ప్రయాణానికి నా గొంతులో జీరపోతూ ఒక బాధ...

ఒక్కొక్కరుగా బస్సులోకి ప్రయాణీకులు ఎక్కుతున్నారు. వాళ్ళకు కేటాయించిన సీటు నెంబర్లు వెతుక్కుంటూ, వెంట తెచ్చుకున్న లగేజిని సర్దుకుంటున్నారు.

ఇంకో అరగంట తర్వాత నిండుగా బస్సు కదిలింది. మన కిష్టమైన వాళ్ళకు వీడ్కోలు పలుకుతూ సాగనంపడం... అందునా చెమ్మగిల్లిన తడికళ్ళతో... చాలాకష్టం! ఇష్టమున్నచోట కష్టమూ వుంటుంది కదూ.

రాత్రి ఆకాశం నిశ్శబ్దాన్ని మోస్తూ పై నుంచి అదే పనిగా పరిశీలిస్తున్నట్లుగా వుంది.

***

నేనింటికి వెళ్ళే సరికే ఇంకో గంట పట్టింది.

అప్పటికే సుప్రజ భోంచేసి పాప తన్మయను పడుకో బెట్టుకొని వుంది.

డైనింగ్ టేబుల్ దగ్గరి కెళ్ళాను.

నాన్న భోంచేసి చేతులు కడుక్కొని వెళ్ళిన ప్లేటు ఇంకా అక్కడే వుంది. ఆ ఎంగిలి నీళ్ళ మధ్యన ఒక ముద్ద అన్నం కూడా!

అన్నం తినడానికి ఎప్పుడు కూర్చున్నా ముందు ప్లేటులో పెట్టిన అన్నం నుంచి ఒక పిడికెడు (ముద్ద) అన్నం తీసి కళ్ళకు అద్దుకొని కింద పెట్టడం నాన్నకు అలవాటు.

ఎందుకట్లా చేసేవాడో చిన్నప్పుడు నాకర్థమయ్యేది కాదు.

నేను కూడా నాన్నలాగానే కొన్నిరోజులు అనుసరిస్తూ అన్నం తినడానికి ముందు ఒక ముద్ద అన్నం కళ్ళకు అద్దుకొని తీసి కింద పెట్టేవాడిని.

చాలాసార్లు మరిచిపోయే వాడిని.

నాన్న కోపంగా వుండేటప్పుడు తమ్ముడు అరవింద్ కూడా ఆయన దగ్గర మంచి పేరు తెచ్చుకోవడానికి ఇలాంటి ట్రిక్కే ప్రయోగించే వాడు.

నాన్న ఎందుకలా ఒక ముద్ద తీసి పెట్టేవాడో తెలుసుకోవాలని నాకు బలంగా వుండేది.


నాన్నను అడిగే ధైర్యం లేక పోయేది.

అమ్మకు చెప్పే జ్ఞానం లేక పోయేది.

పై చదువులు చదువుకుంటూ, ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ, ఉద్యోగంలో చేరిపోయి పట్నాలకు వలస వచ్చిన ఈ బతుకాటలో ఆ తర్వాత దాని సంగతే మర్చిపోయాను.

ఇలా ఆలోచిస్తూ భోంచేస్తూ వుండగానే సుప్రజ నా దగ్గరికి వచ్చి నిల్చుంది.

అటు వైపు వున్న చిన్న ఎంగిలి ప్లేటు ఇంకొకటి తెచ్చి నా ముందు వుంచింది.



అది పాప తన్మయ ఎప్పుడూ భోం చేసే ప్లేటు. దాంట్లో కూడా ఎంగిలి నీళ్ళ మధ్యన ఒక చిన్న అన్నం ముద్ద వుంది.

బయట వాతావరణంలో ఏదో మార్పు చోటు చేసుకుంటున్నట్లుగా వుంది.

వానవొచ్చేటట్లుగా వుంది.

'బస్సు ఎక్కించి వచ్చారా? మీరే చూడండి... మీ నాన్న అలవాటు పాపకు కూడా నేర్పించి పోయాడు. అది కూడా ఇప్పుడు ఇలా ఒక అన్నం ముద్ద తీసి కళ్ళ కద్దుకొని కింద పెడుతోంది. రేపు స్కూల్లో లంచ్ చేసేటప్పుడు ఇలా చేసిందనుకోండి... మన పరువేం కావాలి? ఆ పెద్దాయనకు కొంచమైనా ఆలోచన వుందంటారా?' చేతులు తిప్పుతూ పక్కనే వున్న ఖాళీ కుర్చీని దగ్గరగా లాక్కొని కూర్చుంది.

నేనేం మాట్లాడలేదు.

తాను కూడా కాసేపు ఏం మాట్లాడకుండా ఎంగిలి ప్లేట్లలోని అన్నం ముద్దల్నే చూస్తూ వుండిపోయింది తలపట్టుకొని!

'నిజంగా చెప్తున్నానండి. మీకిది చిన్న విషయంగానే వుండొచ్చు. నాకు పెద్ద తలనొప్పి అయిపోయింది. ఆ అన్నం ముద్దల్ని చూస్తుంటేనే నాకు కోపం వచ్చేస్తోంది' తన అసహనాన్ని వ్యక్తం చేసింది ఇంకోసారి సుప్రజ.

నేను నీళ్ళు తాగి, చేతులు కడుక్కొని అక్కడ్నుంచి పైకి లేచాను.

'పని మనిషి మళ్ళీ రావడం మానేసింది. రేపట్నుంచి నా చావు నేను చావాల్సిందే'

విసుక్కుంటూ తను కూడా నా వెనకే వచ్చింది.

బెడ్‌రూంలో తన్మయ నిద్రపోతోంది ప్రశాంతంగా.

తన్మయ స్కూల్ బ్యాగ్‌ను తీసుకొచ్చి అందులోని ప్లాస్టిక్స్ బాక్స్ నుంచి రెండు పెన్సిల్ ముక్కలను తీసి చూపించింది సుప్రజ.

అడగడం ఎందుకు? తనే చెప్తుంది అని వూరకుండి పోయాను.

'స్కూల్లో పిల్లలు పెన్సిల్‌ను దొంగతనం చేస్తున్నారని ఇది మీ నాన్నతో చెప్పిందట. ఆయన వెంటనే మనం పండ్లు కోసుకునే చాకుతో ఒక్కో పెన్సిల్‌ను మధ్యలోకి కట్ చేసి రెండు ముక్కలుగా చేసేశాడు. ఒకటిపోతే ఇంకొకటి తీసుకొని పొమ్మని సలహా ఇచ్చి బాక్స్‌లోని పొడవు పెన్సిల్స్ అన్నింటిని రెండు ముక్కలుగా చేసిచ్చి పోయాడు' కోపంగా వాటిని మళ్ళీ బ్యాగ్‌లోకే విసిరేస్తూ చెప్పింది.

మళ్ళీ తనే కాసేపాగి...

'ఇంతకీ ఆయన ఉద్దేశమేమిటి? మనం సమాజంలో గౌరవంగా బతకడం ఆయన కిష్టం వుండదా? యింత చీప్‌గా ఆలోచిస్తాడేంటి? మిమ్మల్ని కూడా ఇలాగే పెంచాడా?' ప్రశ్నార్థంగా నా వైపు చూసింది సుప్రజ.

బయట వర్షం చినుకులు కురుస్తున్నాయనడానికి నిదర్శనంగా తడిసిన మట్టివాసన వస్తోంది. నా చిన్నప్పుడు ఎర్రటి లైఫ్ బాయ్ సోప్‌ను తెచ్చి దారంతో అటువైపు ఒకరు, ఇటు వైపు ఒకరు పట్టుకొని మధ్యలోకి కట్‌చేసే దృశ్యం గుర్తుకొచ్చింది. ఇంటిల్లిపాదిమి అదే సోప్ వాడే వాళ్లం. కట్ చేసిన పెన్సిల్స్ అనుకోగానే నవ్వొచ్చింది.

సుప్రజ కోపంగా వున్నప్పుడు నవ్వి ఆమె ఆగ్రహానికి ఆజ్యం పోయిడమెందుకని మౌనంగా వుండి పోయాను.

'ఇదిగోండి. ఈ రెండు నోట్‌బుక్స్ చూశారా? పైన అటక మీద వుండే పుస్తకాలన్నీ కిందకి దించి దుమ్ము దులిపి పాత నోట్‌బుక్స్‌లో మిగిలిపోయిన తెల్ల కాయితాలన్నీ చించి ఇలా దారంతో కుట్టి ఈ రెండు నోట్‌బుక్స్ తయారుచేయించి ఇచ్చిపోయాడు. చూడండి... కొన్ని పేపర్లు పొడవుగా, ఇంకొన్ని పొట్టిగా వీటిని రాసుకోవడానికి స్కూల్‌కు తీసుకెళ్లమని తన్మయకు చెప్పాడంట. స్కూల్లో మిగిలిన పిల్లల దగ్గర ఎంత చులకనై పోతాం?'

నుదుటికి పట్టిన చమటను తుడుచుకొంటూ చెప్పుకొచ్చింది సుప్రజ.

కిచన్‌లో లైట్ ఆర్పేసి వచ్చి మళ్ళీ సోపాలోనే కూర్చున్నాను.

బయట మెరుపు మెర్సింది. దాని వెలుగు విండో గ్లాస్ మీద పరావర్తనం చెందింది. వాన పడుతున్న శబ్దం.

'చెప్పడం మర్చిపోయాను మధ్యాహ్నం మీ నాన్నగారు నాకు కొంత జ్ఞానబోధ కూడా చేశారు' చెప్పింది సుప్రజ విసురుగా.

'దేని గురించి...' అన్నాను తెలుసుకోవాలనే

ఉత్సాహంతో.

'యింక దేనిగురించి అదే అన్నం తినే ముందు ఒక ముద్ద తీసి కళ్ళ కద్దుకొని కింద ఎందుకు పెడ్తా రనే సందేహం పైనే..'పెదవి విరుస్తూ అన్నది సుప్రజ.

దానికి నాన్న ఏం జవాబిచ్చి వుంటాడో తెల్సుకో వాలనే తపనతో చెప్పమన్నట్లు కళ్ళు ఎగరేశాను వెంటనే.

'ఆయనదొక పిచ్చి వేదాంతం....

ప్లేట్ అన్నం నీ ఆకలి తీరుస్తుంటే అందులోని ఒక ముద్ద అన్నం తీసి పక్కన పెట్టడం ప్రతి మనిషీ కనీస ధర్మం. ఒక్కడే తినింది తిండి కాదు. ఒక్కడే బతికింది బతుక్కాదు. పిడికె బువ్వ తీసిపెట్టను నీకు చేతులు రాకపోతే ఎట్లా; చీమలు, చిలుకలు, ఎలుకలు, బల్లులు, రిల్లులు, పురుగులు, ఉడుతలు, కాకులు వీటన్నిటికీ రెండు మెతుకులు పెట్టినట్టు వుంటుందట. కళ్ళ కద్దుకొని ఆ పరమాత్ముని పేరు మీద దానం చేసినట్లు, దానివల్ల ఎంతో పుణ్యం వస్తుందని, తన్మయకు కూడా ఈ పద్ధతి నేర్పించ మని సూచన కూడా చేశారు.''

చెప్తూచెప్తూనే లోగా ఇంట్లోకి వెళ్ళింది.

బీరువాలోంచి పాకెట్ డైరీని తీసుకొచ్చి సోపాలో నా ప్రక్కనే కూర్చొంది సుప్రజ. తని ప్పుడు ఏం చేస్తుందో, దాన్నెందుకు ఇప్పుడు బయ టికి తీసిందో అర్థమవుతూనే వుంది. నాన్న ఫోన్ చేసినప్పుడో, ఎవర్నైనా వూర్నుంచి మనుషుల్ని పుర మాయించి డబ్బు కోసం పంపినప్పుడో ఎంతెంత ఇచ్చింది దాంట్లో క్లియర్‌గా రాసిపెడుతూ వుంటుంది. ఈసారి నాన్నే ఇంటికి వచ్చాడంటే పెద్ద మొత్తమే నేనిచ్చి వుంటానని, ఆ మొత్తమెంతనో, దాని అంకెలేవో చెబితే రాసుకోవాలనే ఆతృత కన్పి స్తూనే వుంది.

పొలం సాగుకు, విత్తనాలకు, బోరు నీళ్ళకు, కలుపులకు, పురుగుల మందులకు, కోత మిషన్లకు, ట్రాక్టర్ల బాడుగలకు, కూలోళ్ళకు, రైస్ మిల్లుకు ఇలా ఖర్చుల కోసం నాన్నకు ఎప్పుడెప్పుడు ఎంతెంత పంపించామో తారీఖులతో సహా ఈ పాకెట్ డైరీలో తను రాసి పెడుతోంది.

చూస్తోంది... నావైపే తీక్షణంగా కన్నార్పకుండా చూస్తోంది. ఆ చూపు రకరకాల ప్రశ్నల్ని సంధిస్తు న్నట్లు వుంది. నేను సిటీలో రాత్రీపగలూ పనిచేసి కష్టపడి సంపాదించినదంతా నాన్న కోసం, ఆయన ఆడే వ్యవసాయ జూదానికి అర్పిస్తున్నట్లు, ఆ డబ్బులు వెనక్కి వచ్చేదీ లేదు... చచ్చేదీ లేదు. నువ్వొక చదువుకున్న మూర్ఖుడివి. ఒక గింజ నాటితే వంద గింజలు కాస్తాననే పైరు ఆడే మాయ నాటకాన్ని మీరెప్పటికి తెల్సుకుంటారు? యింకెంత సొమ్ము కరువు భూమిలో గుమ్మరిస్తారు?

ఎవడైనా ఒకసారి మోసపోతాడు లేదా రెండు సార్లు మోసపోతాడు. ఇదేంది? నాలుగేళ్ళుగా కరువు వస్తానే వుంది. నేలను నమ్ముకొని పెట్టుబడి పెడ్తానే వుండారు. అది ఎన్నిసార్లు నట్టేట ముంచినా ఇంకా తెల్సుకోలేక పోతే ఎలా?

అడిగే వాడికైనా ఉండాలి... ఇచ్చే వాడికైనా వుండాలి...!

సుప్రజ చూపులోని అంతరార్థాన్ని గ్రహిం చాను. తుఫాను ముందుటి ప్రశాంతత.

చేతి వేళ్ళతో డైరీలోని లెక్కలను ఒకటికి రెండు సార్లు ముందుకీ, వెనక్కీ కూడి–

'ఇప్పటివరకు మొత్తం మీ నాన్న కిచ్చిన డబ్బు నలభై ఎనిమిది వేలు. ఇక ఇప్పుడెంతిచ్చారో చెప్తే దాన్ని కూడా దీనికి కలిపి రాసిపెడ్తాను. ఒక పని అయిపోతుంది.' అంది నిట్టూర్పు విడుస్తూ.

నేను సమాధానం ఇచ్చేలోగానే మళ్ళీ తనే ఇంకో ప్రశ్న వేసింది.

'పొలంలో వేసిన పొద్దు తిరుగుడు పూలు ఎట్లాండాయంటా? పంట ఈ సారైనా చేతికొస్తుం దంటావా?' అని!

'లేదు. పంట మళ్ళీ పోయింది. పోయినవారమే పొద్దు తిరుగుడు పూలు మాడిపోతే గొర్రెలను తోలుకొని మేపుకునేటోళ్ళకు చేను మేపుకోమని వది లేసినాడంట. వాన ఎక్కడొచ్చింది? బోర్లలో నీళ్ళు ఎక్కడున్నాయి? యేర్లే ఎండిపోయి చిత్తల ఎర్ర దుమ్ముకొట్టుకుంటూ సుడులు తిరుగుతా వుంటే ఆయనేం చేస్తాడు? అందరు రైతులతో పాటే ఆయ నగూడా!' చెప్పాను సర్ది చెప్తున్న ధోరణిలో.

నేను చెప్తే వింటేకదా... ఆ భూమిని నమ్ముకో నేది వద్దు. వేలువేలు తీసుకపోయి ఆ మట్టిలో పోసేది వద్దని. నా మాట విన్పించుకున్నారా? మీకు జరగాల్సినదే జరిగింది... అనేట్లుగా లో చూపుతో చూస్తూ–

వెటకారంగా 'నవ్వింది' అంతే!

రైతు జీవితం నవ్వుల పాలైందా? రైతంటే అంద రికీ యింత చిన్నచూపెందుకు? కాలుమీద కాలేసు కొని నువ్వు నీ ఇంట్లో కూర్చుంటే వాడెవడో రైత గాడు... ఎండకు ఎండి చమటతో తడిసి బురద మట్టిలో మడకదున్ని, నారుపోసి, నీరుపెట్టి కలుపు తీసి, రాత్రీ, పగలూ కాపలా కాసి గింజ గింజను కాపాడ్తా సంచులకు ధాన్యాన్ని నింపుకొని నీ కరెన్సీ కాగితాల ముందు మోకరిల్లి నీకు నైవేద్యం పెట్టడమే వాడు చేసుకున్న శాపమా?

నాన్నకు నేనేం చెప్పాలి? కరువుకాటుకు ఎన్ని సార్లని నువ్వు విలవిలలాడి పోతావు... వ్యవసా యాన్ని వదిలేయమని చెప్పాలా? భూమిని అమ్మేసి వదిలించుకోమని చెప్పాలా? రబీ లాటరీ టికెట్ ఖరీఫ్ మట్కా నెంబరాటలపైన యిక పెట్టుబడి పెట్టవద్దని సలహా ఇవ్వాలా? ఈ జూదం ఆడొద్దని సూచన చేయాలా?


నాన్న వొక మట్టి మనిషి.

అతడి ఆలోచనలు ఎప్పుడూ భూమి గురించి పంటల గురించే పరిభ్రమించేవి.

నాన్న ఎప్పుడూ పొలం దగ్గరే వుండేవాడు.

చేతిలో పారపట్టుకొని, తలకి పాగా చుట్టుకొని నీళ్ళు పారబెడ్తా పొలం గట్ల మీద నడుస్తూ అదే తన లోకం అన్నట్లు తిరిగే వాడు. మంచి విత్తన కాయల కోసం పల్లెలన్నీ జల్లెడపట్టి సేకరించుకునే వాడు.

దేవళం చెరువుకు ఆనుకొని వుండే సత్రం అరు గుమీద కూర్చుని అమ్మ గంపలో మోసుకొని తీసు కుపోయిన ఎర్ర కారం, రాగి సంగటి తృప్తిగా తిన డానికి పూనుకునే వాడు. ఒక పిడిసె ముద్ద కళ్ళకద్దు కొని తీసి పక్కన పెట్టేవాడు. కాడెద్దుల్ని మర్రిచెట్టు నీడలో కట్టేసేవాడు. ఎగువ కయ్యల్లోకి పోయి కోసుకొచ్చిన పచ్చటి గడ్డితో దాన్ల కడుపు నింపే వాడు. దేవళం చెరువుకు చుట్టుపక్క వుండే భూముల్లో పంటల బంగారం పండుతా వుండేది. చెరువులో రకరకాల పక్షులు వింత వింత శబ్దాలు చేసుకుంటూ తిరిగేవి. పొలాల మీదుగా వచ్చే చల టిగాలి చెరువు నీళ్ళలో ఈదులాడి సంబరపడేది. చెరువులో బుడుంగు బుడుంగుమంటూ నల్ల



చెరువుకోళ్ళు ఎక్కడ చూసినా కలియ తిరుగుతా సందడి చేస్తావుండేవి. తాబేళ్ళు అప్పుడప్పుడూ తలను బయటికిపెట్టి పలకరిస్తా వుండేవి. బెస్తోళ్ళు చెరువులోకి ఎప్పుడు దిగినా వల నిండా చేపలతో తిరిగొస్తా వుండిరి. తామర పూలు తెల్లగా, ఎర్రగ కవ్విస్తా పూసేవి. చెరువు పడమటివైపున ఆకాశమెత్తు వేపచెట్టు కాలిబాటన పోయే కూలోళ్ళకు నీడనిస్తా వుండేది. తిరప్తికి పోయే యాత్రికులు అక్కడే మూడు రాళ్ళ పొయ్యిలు పెట్టుకొని వండుకొని తిని విడిది చేసి పోతా వుండే వాళ్ళు. చెరువుకు ఆనుకొని వుండే మూడెకరాల భూమిలో పంటలు పండినా, కరువొచ్చి ఎండినా ఎప్పుడూ నాన్న ఒకే విధంగా కనపడేవాడు. తన పని తాను చేసుకుంటూ పోతుండే వాడు. మాకు రెండు చోట్ల భూమి ఉండేది. తూరుపు వైపు కవ్వంకోన కొండ దిక్కు ఐదెకరాల భూమిని రాళ్ళు ఎక్కువగా వుండాయని చాలా కాలం బంజరుగానే వదిలేశాడు. పెద్దపెద్ద బండరాళ్ళతో గంభీరంగా తలెత్తుకొని ధీటుగా నిలబడి నట్లు వుండేది కవ్వం కోన కొండ. నువ్వు ఏ వైపునుంచి చూసినా ఆ కొండ నీవైపే చూస్తున్న ట్లుండేది. కొండ శిఖరం అంచున పోతురాజు దేవళం కూడా ఉండేది. దానిపైకి చేరుకోవడానికి నాల్గు దిక్కుల నుంచి నాలుగు కాలి దావలు కూడా వుండేవి. ఈ కొండ వరుస ఇట్లాగే శేషాచలం కొండల్లోకి కలుస్తుందని పెద్దోళ్లు చెప్పేవారు.

నాన్న కవ్వంకోన కొండ దగ్గరుండే బంజరుభూమిలోని ఐదెకరాల్లో, రెండెకరాలు మాత్రం సాగులోకి తీసుకు రావడానికి నిరంతరంగా కష్టపడ్డాడు. తర్వాత నిమ్మ చెట్లు వేశాడు. దానివల్ల కొంత ఆదాయం వచ్చేది. దేవళం చెరువుకు ఆనుకొని వుండే భూమి మూడెకరాల్లో వరి పైరు వేస్తా వుండేవాడు.

నాన్నకు ఇద్దరం కొడుకులం. ఒక కూతురు.

పాప పుట్టిన సంవత్సరానికే అనారోగ్యంతో చనిపోయింది.

నన్నూ... తమ్ముడిని నాన్న బాగా చదివించాడు.

నేను హైదరాబాదులో, తమ్ముడు అరవింద్ బెంగుళూరులో ఉద్యోగాలు సంపాదించుకున్నాం.

కాలం సాగిపోతూనే వుంది.

వూర్లో మార్పులు చోటు చేసుకుంటూ వచ్చాయి.

చూస్తుండగానే దేవళం చెరువు ఎండిపోయింది.

ఎంత కరువొచ్చినా ఎప్పుడూ దాంట్లో మాత్రం నీళ్ళు గలగలమని శబ్దం చేస్తా వుండేవి. చెరువు చచ్చిపోయింది. మనిషి చస్తే ఏడుస్తారు కానీ చెరువు చస్తే ఎవరేడుస్తారు? సర్పంచు ఇటుకల బట్టీ వేసినాడు. దిగడాల వుండే కొన్ని నీళ్ళు కూడా మోరీ దగ్గర్నుంచి వదిలేసినారు. ఒకరిని చూసుకొని ఒకరు చెరువులో ఇటుకల బట్టీలు వేసుకుంటూ వచ్చినారు. చెరువు నిండా ఎర్రటి పొగ... తెల్లటి దుమ్ము... పచ్చనిపల్లెని దుమ్మూ ధూళి కమ్ముకున్నాయి. బోర్లు చుక్క నీళ్ళను కూడా ఇవ్వలేకుండా వట్టిపోయినాయి. ఎర్ర మట్టిని ఇటుకల కోసం తవ్వి తవ్వి మనిషెత్తు గుంతలు తయారైనాయి.

ఇంతకుముందు ఏ చెరువు నీళ్ళను నమ్ముకొని వ్యవసాయం చేసే వాళ్ళో.... ఇప్పుడు ఆ చెరువే ఎండిపోయిన తర్వాత ఇంకా అదే వ్యవసాయాన్ని ఎందుకు చేస్తున్నారో... వారికి ఇంకో పని చేత కాదు కాబట్టా! వీళ్ళెప్పటికి సత్యాన్ని గ్రహిస్తారు? విత్తనాల కోసం, ఎరువుల కోసం, బ్యాంకు రుణాల కోసం ఎందుకు పడిగాపులు కాస్తూ అధికారుల చుట్టూ, బ్యాంకుల చుట్టూ తిరుగు తుంటారు? ఏమైనా సరే భూమి నుంచి పంటను తీయాలని, దోసిట్లో గింజల్ని చూసుకొని పరవశించి పోవాలనే మొండితనాన్ని ఏమని పిలవాలి?

ఆలోచిస్తూనే వుండి పోయాను.

సుప్రజ నవ్విన నవ్వు నన్ను యింత వెనక్కి తీసుకెళ్ళిందా?

'ఇప్పుడెంతిచ్చారు మీ నాన్నకు?' మరోసారి నా భుజం పట్టి తడుతూ అడిగింది.

నేను లేచి లోపల కెళ్ళి నా టేబుల్‌లో వుంచిన ప్లాస్టిక్ కవరు తీసుకొచ్చి తన ముందు వుంచాను.

ఇదేమిటన్నట్లు ఆశ్చర్యంగా చూసింది.

డబ్బు కట్టలు తీసి తన చేతికిచ్చాను.

'ఎక్కడిది? ఎవరిచ్చారు? ఎందుకిచ్చారు?' వేగంగా ఒకదాని వెంట ఒక ప్రశ్నను తను అడిగేసింది.

మౌనంగా వుండిపోయాను నేను.

'చెప్పండి... ప్లీజ్!' ప్రాధేయపడింది.

'నాన్న తెచ్చాడు వూర్నుంచి. కవ్వంకోనకొండ దగ్గరుండే మన ఐదెకరాల భూమిని కొత్త రైల్వే లైను వేయడం కోసం తీసుకున్నారట. భూసేకరణ చట్టం ప్రకారం డ్రాపు డిక్లరేషన్ కింద మూడు లక్షలా అరవై వేలు వచ్చిందట. నా భాగంగా లక్షా ఎనభై వేలు ఇచ్చి వెళ్ళాడు. ఎంతవద్దని చెప్పినా విన్పించుకోలేదు. మిగతా భాగం డబ్బు అరవింద్‌కు ఇస్తానని చెప్పాడు. భూమి పండినా, ఎండినా నాకుండే ఆధారం మీరేకదరా... అని మాత్రం వెళ్ళేటప్పుడు చెప్పాడు'' అన్నాను దుఃఖస్వరంతో.

సుప్రజ నిర్ఘాంత పోయి డబ్బు, వైపే చూస్తుండి పోయింది.

టీ.వీ. ఆన్ చేశాను. వార్తల ప్రసారం...

ఈరోజు సూర్యగ్రహణం ముగిసిన క్లిప్పింగ్ చూపిస్తున్నారు. చంద్రుడు నెమ్మదిగా సూర్యుడిని మింగేస్తూ కొద్దికొద్దిగా సూర్యుడికి అడ్డునుంచి తొలగిపోతూ వచ్చాడు. సూర్యుడు తిరిగి పూర్ణబింబంగా ఆవిష్కృతమైనాడు. టీ.వీ.లో దృశ్యాలు చూపిస్తున్నారు. సుప్రజ కన్నార్పకుండా చూస్తూనే వుంది.

సూర్యగ్రహణం అనేదేకాకుండా ఇంకొంత లోతుగా, గాఢతతో, పరిపక్వతతో మరేదో మానవ సంబంధాలకు సంబంధించిన అంశంపై కూడా గ్రహణం వీడాల్సిన అవసరాన్ని గమనిస్తున్నట్లే వుంది.

కానేసటి తర్వాత చూస్తే సుప్రజ కళ్ళు చెమ్మగిల్లినట్లు గుర్తించగలిగాను.

గుండె లోతుల్లోంచి కళ్ళ కవటాల ద్వారా మనసు పొరల్లోని మలినాన్ని శుభ్రపరుస్తూ ఊర్ధ్వ పీడనమేదో బహిర్గతమవుతున్నట్టుగా వుంది. బయట చీకటివాన కురుస్తూనే వుంది.

*

*రచయిత సెల్ నెం: **94400 74893***



## ప్రేమలో పడిన విమలారామన్?

''ఎవరైనా...ఎప్పుడైనా'' అంటూ టాలీవుడ్‌లో ఎంట్రీ ఇచ్చిన విమలారామన్ హీరోయిన్‌గా సక్సెస్ సాధించలేకపోయిన సంగతి తెలిసిందే! ప్రస్తుతం అవకాశాలు లేక ఖాళీగా ఉంటున్న విమలారామన్ కన్ను తనలాగే ఖాళీగా ఉంటున్న హీరో మీద పడింది. ఇంకేముందీ ఇద్దరూ కలిసి చెట్టాపట్టాలేసుకొని పబ్‌ల చుట్టూ, స్టార్ హోటళ్ళ చుట్టూ తిరుగుతూ పలువురి కంట్లో కూడా పడ్డారు. ఆ హీరోతో విమలారామన్ పీకల్లోతు ప్రేమలో కూరుకుపోయిందన్న పుకార్లు టాలీవుడ్‌లో షికారు చేస్తున్నాయి. అయితే ఇవన్నీ ఒట్టి పుకార్లే అని వారిద్దరూ కొట్టిపారేయడం షరా మామూలే అనుకోండి. ఏదైతేనేం? హీరోయిన్‌గా సెటిల్ కాలేకపోయినా లవర్‌గానైనా విమలారామన్ సెటిల్ అవుతుందని పలువురు ఊహాగానాలు చేస్తున్నారు. అన్నట్టు, ఆ హీరోతో కలిసి విమలారామన్ తెలుగులో ఓ సినిమా చేస్తోందట! ఆ సందర్భంలోనే వీరిద్దరి మధ్య 'స్నేహం' బలపడిందని అంటున్నారు.